సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం। 14 । జూలై । 2023

I



గోశాలలకు కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న కోడెలను పెద్ద వంగరలోని శివపార్వతీ గోశాలకు 10, జఫర్ఘడ్ మండలం ముగ్ధంతండాలోని శ్రీఆంజనేయ గోశాలకు 10 కోడెలు అందజేశారు.



మిడ్‌మానేరులో 15 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో నీటిమట్టం 15.38 టీఎంసీలకు చేరింది. కరీంనగర్ ఎల్‌ఎండీలోకి గురువారం 280 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

రాజన్న హుండీ ఆదాయం రూ.40.72 లక్షలు



నాణేలు లెక్కిస్తున్న స్వచ్ఛంద సంస్థల మహిళలు

వేములవాడ: రాజన్న ఆలయంలో నిల్వ చేసి ఉంచిన నాణేలను రెండు రోజులుగా లెక్కిస్తున్నారు. గురువారం నాడు రూ.40,72,500 ఆదాయం సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ఏఈవోలు ప్రతాప నవీన్, హరికిషన్, శ్రీనివాస్, జయకుమారి, శ్రీరాజరాజేశ్వరీ సేవా సమితి సభ్యులు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం మర్తనపేటలో ఎస్సీ సంఘ భవనానికి మిగిలిన పనుల కోసం రూ.3 లక్షల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా గురువారం పనులను ప్రారంభించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు అమలుచేస్తున్నారన్నారు. దళితబంధు ద్వారా దళితుల కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాయన్నారు. సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణారావు, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్యయాదవ్, సీనియర్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్

సిరిసిల్లఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల ముందే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణ ప్రసాద్ కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లో టీఆర్‌టీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షనర్ల పీఆర్సీ గడువు జూన్ 30న ముగిసిందని, కొత్త పీఆర్సీని నియమించాలని కోరారు. జూలై నుంచి మధ్యంతర భృతిని అమలు చేయాలన్నారు. టీఆర్‌టీఎఫ్ మండలాధ్యక్షుడు పోతుగంటి రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజం, నాయకులు విష్ణు, రాంప్రసాద్, పద్మారెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

గురుకులాల సీట్ల భర్తీ స్పాట్ సెలక్షన్స్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని గురుకులాలలో 2023–24 విద్యాసంవత్సరానికి మిగిలిన ఎస్సీ కేటగిరీ సీట్ల భర్తీకి ఈనెల 15న స్పాట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయ అధికారి జాక్విలిన్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎస్సీ కేటగిరీలో మాత్రమే సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల బాలికలు చింతకుంట గురుకుల ఆవరణలో, బాలురు సీఓఈ అలుగునూరులో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

చెత్త సేకరణ ట్రాక్టర్ అడ్డగింత



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న కార్మికులు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం ప్రైవేటు వ్యక్తులతో చెత్త సేకరిస్తుండగా ట్రాక్టర్‌ను సమ్మెలో ఉన్న జీపీ కార్మికులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో తామెంతో సేవ చేశామన్నారు. తమ డిమాండ్ల అమలు చేయాలని కోరుతూ సమ్మె చేస్తున్న సమయంలో ఇతరులతో పనులు చేయిస్తే ప్రభుత్వం తమను పట్టించుకోదన్నారు. ఇలాంటి చర్యలతో ఐక్యత దెబ్బతీయొద్దని కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, జీపీ కార్మికులు ఉన్నారు.

25 రంగులు డిజైన్లు

“ ఇతను దూదం ప్రకాశ్(53). సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌లో బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేస్తున్నాడు. కంటికి కనిపించని నల్లని పోగులు ఉండడంతో కంటి అద్దాలను పెట్టుకుని మరీ పోగులు తెగిపోతే అతికించాల్సి వస్తోంది. జోటాలను మార్చాలన్నా.. పోగులను వెతకాల్సిందే. ప్రకాశ్ ప్రస్తుతం నాలుగు సాంచాలపై బతుకమ్మ చీరల బట్టను నేస్తూ నెలకు రూ.25 వేలు సంపాదిస్తున్నాడు. అదే బతుకమ్మ చీరలు కాకుండా పాలిస్టర్ బట్టను నేస్తే.. ఇందులో సగం అంటే రూ.12,500 లభిస్తాయి. ఇలా సిరిసిల్ల కార్మికక్షేత్రంలో నేతన్నలు బతుకమ్మ చీరల ఉత్పత్తితో మెరుగైన జీతాలు పొందుతున్నారు. ఇలాసిరిసిల్లలో 5 వేల మంది కార్మికులు 12,500 మగ్గాలపై బతుకమ్మ చీరల బట్టను ఉత్పత్తి చేస్తున్నారు.



- సిరిసిల్లలో నిత్యం 6 లక్షల మీటర్ల ఉత్పత్తి
- 12,500 మగ్గాలపై చీరల తయారీ
- ఇప్పటికే 2.50 కోట్ల మీటర్ల బట్ట ఉత్పత్తి
- సెప్టెంబరు 15లోగా లక్ష్య సాధన



సిరిసిల్ల: బతుకమ్మ పండుగకు రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం చీరలను కానుకగా అందిస్తోంది. ఈసారి 25 రంగులు.. 25 డిజైన్లతో చీరలు తయారు చేయాలని ఆర్డర్లు ఇచ్చారు. జరీ అంచులతో కూడిన కొంగు, రెండు వైపులా పట్టీలతో కూడిన చీరలను డిజైన్ చేశారు. రాష్ట్రంలోని 1.20 కోట్ల మంది తెల్లరేషన్ కార్డుదారులకు 2017 నుంచి ప్రభుత్వం చీరలు అందిస్తోంది. ఇందుకు రూ.330 కోట్లు కేటాయించింది. గతంలో రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టెస్కో) ద్వారా బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వగా.. ఈ ఏడాది తొలిసారిగా తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీపీటీడీసీఎల్) ద్వారా ముందే ఆర్డర్లు అందించారు. దీంతో నేతన్నలపై ఒత్తిడి లేకుండా బతుకమ్మ చీరల ఉత్పత్తి సవ్యంగా సాగుతోంది.

నేతన్నలకు మెరుగైన వేతనాలు

బతుకమ్మ చీరల ఆర్డర్లతో సిరిసిల్లలో నేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. కార్మికులు ఉత్పత్తి చేసిన చీరల బట్ట ఆధారంగా 10 శాతం యారన్(నూలు) సబ్సిడీని ప్రభుత్వం బోనస్‌గా అందిస్తుంది. 2020 నాటి 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు 5,374 మంది కార్మికులకు రూ.8.79 కోట్లు ఇటీవల మంజూరయ్యాయి. ఒక్కో కార్మికుడికి రూ.20 వేల నుంచి రూ.45 వేల వరకు అదనపు ప్రయోజనం కలిగింది. ఎన్ని మీటర్ల బట్టను ఉత్పత్తి చేస్తే అంత మేరకు డబ్బులు నేరుగా కార్మికుల ఖాతాల్లో జమయ్యాయి. ఇలా శ్రమించే కార్మికులకు మెరుగైన ఉపాధి లభిస్తుంది.

ముందే ఆర్డర్లు.. ముందే సేకరణ

సిరిసిల్లలోని పవర్‌లూమ్ మగ్గాలకు 5.92 కోట్ల మీటర్ల బతుకమ్మ చీరల బట్ట ఉత్పత్తి లక్ష్యంగా ఇవ్వగా సిరిసిల్ల శివారులోని టెక్స్‌టైల్‌పార్క్‌లోని ఆధునిక మగ్గాలకు 68 లక్షల మీటర్ల జాకెట్ బట్ట ఉత్పత్తి లక్ష్యాన్ని అందించారు. మొత్తంగా 6.60 కోట్ల మీటర్ల బతుకమ్మ చీరల బట్టను ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించారు. ఆరు నెలల ముందే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడంతో నూలు(ధారం) దిగుమతి చేసుకుని చీరల బట్టను ఉత్పత్తి చేస్తున్నారు. మరోవైపు ఉత్పత్తి అయిన చీరల బట్ట సేకరణను ముందే ప్రారంభించడం విశేషం. కానీ గతేడాదికి సంబంధించిన ప్రభుత్వ ఆర్డర్ల బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉండడంతో వస్త్రోత్పత్తిదారులు పాత బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు.

బతకమ్మ చీరల ఉత్పత్తి వివరాలు ఇలా..

చీరల ఆర్డర్లు : 6.60 కోట్ల మీటర్లు
ఆర్డర్ల విలువ : రూ.330 కోట్లు
ఉత్పత్తి చేస్తున్న చిన్నతరహా పరిశ్రమలు : 127
చీరల ఉత్పత్తిలో భాగస్వాములైన మ్యాక్స్ సంఘాలు : 139
ఒక్కో మీటరుకు ప్రభుత్వం చెల్లిస్తుంది : రూ.35.50
చీరలు అందించాల్సిన చివరి గడువు : సెప్టెంబరు 15
ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న సాంచాలు : 12,500
శ్రమించే నేతకార్మికులు: 5 వేలు
నిత్యం ఉత్పత్తి అవుతున్న చీరల బట్ట : 6 లక్షల మీటర్లు
ఇప్పటి వరకు సేకరించిన బతుకమ్మ చీరల బట్ట: 0



బతుకమ్మ చీరల బీము

ట్యాబ్‌ల్లో నమోదు చేస్తున్నాం



“ సిరిసిల్ల బతుకమ్మ చీరల ఉత్పత్తి సాగుతుంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న చీరల ఉత్పత్తి వివరాలను, మగ్గాల సమాచారాన్ని ట్యాబ్‌ల్లో నమోదు చేస్తున్నాం. దీంతో చీరల ఉత్పత్తి లెక్కలు పక్కాగా తెలుస్తాయి. సెప్టెంబరు 15వ తేదీలోగా చీరల ఉత్పత్తి లక్ష్యం సాధించాలి. ఆ దిశగా సిరిసిల్ల నేతన్నలు ముందుకు సాగుతున్నారు. గడువులోగా చీరల ఉత్పత్తి లక్ష్యం సాధిస్తాం. – మిట్టకోల సాగర్, జౌళిశాఖ సహాయ సంచాలకులు, సిరిసిల్ల

15 నుంచి బీసీ ఆర్థిక సాయం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



వేములవాడలోని మూలవాగు బండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని బీసీ కులవృత్తుల వారికి ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఈనెల 15 నుంచి పంపిణీ చేస్తామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులతో గురువారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బీసీ కులవృత్తులు, చేతివృత్తుల వారికి ఆర్థికసాయం అందిస్తామన్నారు. దారిద్య్రరేఖకు దిగువన ఉన్న వారికి తొలుత సాయం అందుతుందని, ఇది నిరంతర ప్రక్రియగా భావించాలన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 300 మందికి ఆర్థిక సాయం అందిస్తామని వివరించారు. చేతివృత్తుల వారిని, కులవృత్తికారులను ప్రోత్సహించే లక్ష్యంతోనే ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. అంతకుముందు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ వీడియో కాన్ఫరెన్స్‌లో కులవృత్తుల వారికి ఆర్థిక సాయం అందించే అంశంపై జిల్లా అధికారులతో మాట్లాడారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడలో చేపట్టిన పలు పనులను గురువారం పరిశీలించారు. వేములవాడ నందికమాన్ వద్ద ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రూ.కోటితో నిర్మించిన నందికమాన్ జంక్షన్ ను, రూ.98లక్షలతో మూలవాగు ఒడ్డున వంతెన నుంచి వైకుంఠధామం వైపు 330 మీటర్ల వరకు నిర్మించిన మూలవాగుబండ్‌ను, రూ.2.91కోట్లతో నిర్మించిన వెజ్‌మార్కెట్‌ను, తిప్పాపూర్‌లో రూ.31.60 లక్షలతో నిర్మించిన బయోగ్యాస్‌ప్లాంట్, మిషన్ భగీరథ ట్యాంక్, చింతాల్‌ఠాణా పక్కన కోతులకాలనీలో నిర్మించిన 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. రాజన్న గుడి చెరువు ప్రాంగణంలో శివార్చన స్టేజీ, గుడి చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవో పవన్‌కుమార్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, తహసీల్దార్ రాజు ఉన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం మారుపాక, వేములవాడరూరల్ మండలం మల్లిపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ షెడ్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలానికో గ్రామానికి ఎంపిక చేసి రూ.5లక్షలతో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ షెడ్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను జిల్లా కేంద్రంలోని డీఆర్సీసీకి, ఏజెన్సీలకు విక్రయించాలని సూచించారు. రెండు రోజుల్లోగా షెడ్లను అందుబాటులోకి తేవాలన్నారు. జెడ్పీ సీఈవో గౌతం రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్, అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్, ఎంపీడీవోలు శ్రీధర్, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఆర్డీవోలు

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ఎన్నికల సంఘం



టి.శ్రీనివాస్‌రావు, ఆర్డీవో, సిరిసిల్ల



పి.పవన్‌కుమార్, ఆర్డీవో, వేములవాడ

సిరిసిల్ల: శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండగా కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలు ఉన్నాయి. సిరిసిల్ల, వేములవాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఆర్డీవోలను నియమించింది. ఈమేరకు సిరిసిల్ల ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావు, వేములవాడ ఆర్డీవో పి.పవన్‌కుమార్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి ఎవరు ఆర్డీవోలుగా ఉంటే.. వారే ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈమేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ !

- ఫిర్యాదుదారుతో బేరసారాలు

సాక్షి ఎఫెక్ట్

రుద్రంగి(వేములవాడ): ఇల్లు లేకున్నా పన్ను వసూలు చేసి రశీదు ఇచ్చిన పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.‘సాక్షి’లో జూన్ 18న ‘ఇల్లే లేదు.. పన్ను రశీదు’ శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించినట్లు సమాచారం. అక్రమ మార్గంలో డబ్బులు తీసుకొని ఇల్లు లేకుండానే ఇంటి పన్ను వసూలు చేసి రశీదు ఇచ్చినట్లు తేలడంతో సదరు కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న కార్యదర్శి ఫిర్యాదుదారుతో బేరసారాలకు దిగిన ఆడియో రికార్డు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. రూ.లక్ష ఇస్తాను ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలంటూ కోరుతున్నట్లు ఆ ఆడియో ద్వారా తెలుస్తోంది. అయితే విచారణ చేపట్టిన మండల అధికారి సైతం ఫిర్యాదుదారుతో మాట్లాడి సెటిల్ చేసుకోమ్మని సూచించడం గమనార్హం.



చె(చి)త్త శుద్ధి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో ఎక్కడపడితే అక్కడే చెత్త పేరుకుపోతుంది. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ఎదుట భారీ ఎత్తున చెత్త పేరుకుపోయింది. గమనించిన వార్డుమెంబర్ పందిర్ల శ్రీనివాస్‌గౌడ్ ప్రైవేట్ వ్యక్తులతో చెత్తను తొలగింపజేశారు. పాఠశాల సెక్యూరిటీ గార్డు దేవిరెడ్డితో కలిసి చెత్తను తొలగించే పనిలో సహాయం చేశారు. స్థానికుడు మిరియాల్‌కార్ శ్రీనివాస్ ఆటో నడుపగా.. చెత్తను ఊరుశివారులోని గిద్ద చెరువు వద్ద పారబోశారు. పాఠశాల ముందు పేరుకుపోయిన చెత్తను తొలగించిన వారిని గ్రామస్తులు అభినందించారు.

ప్రణాళికతో ముందుకెళ్లాలి

- జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి



యూనిట్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

చందుర్తి(వేములవాడ): పరిశుభ్రతను పాటించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి పేర్కొన్నారు. చందుర్తిలోని కంపోస్టు షెడ్డులోని ప్లాస్టిక్ మేనేజ్‌మెంటు యూనిట్, వైకుంఠ ధామం, హరితహారం నర్సరీలను గురువారం జిల్లా అధికారులు పరిశీలించారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ మండలానికి మంజూరైన ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ యూనిట్ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, అడిషనల్ డీఆర్‌డీవో చీకోటి మదన్‌మోహన్, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్, సర్పంచ్ సిరికొండ ప్రేమలత, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రదీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటకు వ్యవసాయ మార్కెట్

కోనరావుపేట(వేములవాడ): మండలానికి ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ మంజూరైంది. కోనరావుపేట మండల ప్రజల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మార్చి 24న వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. దానికి అనుగుణంగా సీఎం కేసీఆర్‌ను కలిసి మరోసారి విన్నవించారు. స్పందించిన సీఎం కేసీఆర్ వ్యవసాయ మార్కెట్ మంజూరుకు అంగీకరించారు. త్వరలోనే మార్కెటింగ్‌శాఖ ముసాయిదాను జారీ చేయనుంది.

బీఆర్‌ఎస్ నిరసనల హోరు

- సిరిసిల్లలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- వేములవాడ మూలవాగు బ్రిడ్జిపై ధర్నా



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



వేములవాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సిరిసిల్లటౌన్/వేములవాడ: ఉచిత కరెంటు అంశంపై కాంగ్రెస్ పార్టీ తీరుపై అధికార బీఆర్‌ఎస్ భగ్గుమంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత కరెంటు సరఫరాపై చేసిన వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు చేపట్టింది. సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు రైతులతో కలిసి ధర్నాకు దిగారు. వక్తలు మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ కేసీఆర్ సర్కారు ఉచిత కరెంటు సరఫరా చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ మాత్రం అనుచిత వ్యాఖ్యలు చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోతుందన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అక్కడి నుంచి సెస్ ఆఫీస్ వరకు వెళ్లి గుమ్మానికి రేవంత్‌రెడ్డి బొమ్మను ఉరివేసి నిరసన తెలిపారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు గాజుల నారాయణ, మంచె శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, బొల్లి రామ్మోహన్ పాల్గొన్నారు.

మూడు పంటలకు కరెంట్

మూడు గంటలు కాదు.. మూడు పంటలకు కరెంటు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నదే సీఎం కేసీఆర్ తపన అని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక మూలవాగు వంతెనపై ధర్నా చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. మా దేశభక్తి ప్రజలకు ఉపయోగపడేది, మీ దేశభక్తి ప్రజలను విభజించేదని కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి విమర్శించారు. పార్టీ టికెట్ అధిష్టానమే నిర్ణయిస్తుందన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నా.. లేకున్నా... నాకేం పర్వాలేదు, పదవిపై వ్యామోహం లేదని వ్యాఖ్యానించారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, జగిత్యాల జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు ఏనుగు మనోహర్‌రెడ్డి, గడ్డం హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెహందీ డిజైన్స్ కాంపిటీషన్



మెహందీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం మెహందీ డిజైన్స్ కాంపిటీషన్ నిర్వహించారు. 80 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం మెహందీ డిజైన్స్ ఉపాధి అవకాశంగా మారిందన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ వాణి, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ శ్రీవల్లి, సీనియర్ అధ్యాపకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చెత్తను దొంగలించిన వ్యక్తికి జరిమానా



జరిమానా విధిస్తున్న కార్యదర్శి శ్రీకాంత్

కోనరావుపేట(వేములవాడ): బావుసాయిపేటలోని డంపింగ్‌యార్డు వద్ద ఉన్న పొడిచెత్తను దొంగలించిన మామిడిపల్లికి చెందిన రాజారాంకు రూ.3వేల జరిమానా విధించారు. బావుసాయిపేట శివారులోని డంపింగ్‌యార్డు వద్ద రాజారాం చెత్తను ఎత్తుకెళ్లాడు. ఈ విషయాన్ని గుర్తించిన కార్యదర్శి శ్రీకాంత్ జరిమానా విధించారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో



పాఠాన్ని చదివిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని కేజీబీవీని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ గురువారం సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో పాఠాలను చదివించారు. వారితో మాట్లాడి పలు విషయాలు ఆరా తీశారు. సెక్టోరియల్ అధికారి పద్మజ, ప్రిన్సిపాల్ స్వప్న ఉన్నారు.

21 మందికి కు.ని ఆపరేషన్లు

చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 21 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు వైద్యాధికారి రవీందర్ తెలిపారు. ఆపరేషన్లు చేయించుకున్న వారిని ఇళ్లకు సాయంత్రం చేర్చామని వివరించారు.

ఇంటర్మీడియెట్ స్పాట్ అడ్మిషన్

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ కళాశాలల్లో ఇంటర్మీడియెట్‌లో ఫస్టియర్ అడ్మిషన్‌కోసం ఈనెల 15న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు సమన్వయాధికారి బి.జాక్వెలిన్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని చింతకుంటలో బాలికలకు, అల్గునూరులో బాలురకు కౌన్సిలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

గుంతలరోడ్లపై 'తండ్లా'టే !



ఈ చిత్రంలో కనిపిస్తున్న తారులేచి.. గుంతలుపడ్డ రోడ్డు ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాకు వెళ్లేది. మండలంలోని రాచర్లగొల్లపల్లి నుంచి బాకూర్‌పల్లితండా పంచాయతీ మీదుగా దేవునిగుట్టతండాకు ఈ రోడ్డు వెళ్తుంది. ఈ రోడ్డును పట్టించుకునేవారు లేక గుంతలమయమైంది. ఇదే రోడ్డుపై ఇటీవల మంత్రి కేటీఆర్ సైతం వెళ్లారు. అయినా దీనిపై దృష్టి పడలేదు. రెండు మండలాలు, నాలుగు తండాలకు చెందిన ప్రజలు నిత్యం ఇదే రహదారి గుండా ప్రయాణిస్తుంటారు. వర్షాకాలంలో అయితే ఈ రోడ్డుపై ప్రయాణం నరకమే.

- అడుగుతీసి.. వేయడం కష్టమే
- జర్రున జారుతున్న బురదరోడ్లు
- తండాలు జీపీలుగా మారిన మట్టి రోడ్లే దిక్కు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మోకాలు లోతు గుంతలు.. అడుగు తీసి వేసేలోపే జర్రున జారేలా బురద.. వెరసి తండాలకు వెళ్లే రోడ్లు నరకం చూపిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికి బురదమయం కావడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. తండాలు గ్రామపంచాయతీలుగా మారినా సౌకర్యాల కల్పనపై పట్టింపు కరువైంది. చినుకు పడితే చిత్తడిగా మారే రోడ్లపైనే బయట ప్రాంతాలకు.. పొలాలకు జారుతూ.. పడుతూ వెళ్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలమీదికొచ్చి నా అంబులెన్స్ సైతం రాలేని దుస్థితి. ఇదీ జిల్లాలోని పలు గిరిజన తండాలకు వెళ్లే 'దారి'ద్య్రం.

ఈ ఫొటోలో కనిస్తున్నది రుద్రంగిలోని కొచ్చగుట్టతండా, కథలాపూర్ మండలం అంబారిపేటతండాకు వెళ్లే ప్రధాన రహదారి. ఇది రుద్రంగి నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పూర్తిగా ధ్వంసమైన ఈ మట్టి రోడ్డుపై మోకాలు లోతు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే ఈ దారిలోని వాగు వరద రోడ్డుపై నుంచి పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏటా మాదిరిగానే అధికారులు తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.





ఇది చందుర్తి మండలం దేవునితండా నుంచి జలపతితండా మీదుగా కోనరావుపేట మండలం వట్టిమల్ల శివారులోని పుట్టమల్లన్న ఆలయం వరకు వెళ్లే రోడ్డు. నాలుగు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా తారు లేచిపోయింది. కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా అధ్వానంగా మారింది. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్న ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయడం లేదు.



ఇది వీర్నపల్లి మండలంలోని భూక్యతండా, బావుసింగ్‌తండా గ్రామాల నుంచి రాశిగుట్ట తండాకు వెళ్లే దారి. మూడు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డే. మార్గమధ్యలో మరో తండా ఉంది. ఇక్కడ 15 కుటుంబాలు నివసిస్తుంటాయి. చిన్నపాటి వర్షానికే రోడ్డు చిత్తడవుతుంది. తండావాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా అనారోగ్య సమస్య వచ్చినప్పుడు, గర్భిణులు వైద్యం కోసం ఈ దారిగుండా ఆస్పత్రికి వెళ్లాలంటే నరకమే.

అధ్వానంగా రహదారులు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం కమ్మరిపేటతండా, గొల్లపల్లి రహదారులు అధ్వానంగా మారాయి. గతంలో బురదమయంగా ఉన్న రోడ్డు నడవడానికి వీలులేకుండా ఉండేది. ప్రభుత్వ నిధులతో గొల్లపల్లి నుంచి కమ్మరిపేటతండా మీదుగా మెయిన్‌రోడ్డు వరకు తారు రోడ్డు నిర్మించారు. నాణ్యత లేకపోవడంతో పొలాలకు వెళ్లే ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో తిరగడంతో ఈ రహదారి దెబ్బతింది. తారు లేచిపోయింది.

పేరుకే జీపీలు.. అన్నీ మట్టి రోడ్లే

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):

- ఎల్లారెడ్డిపేట మండలంలోని దేవునిగుట్టతండా, బాకూర్‌పల్లితండా, గుంటపల్లి చెరువుతండా, బుగ్గరాజేశ్వరతండాలను ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. పేరుకే నూతన జీపీలు, ఆ తండాలకు వెళ్లడానికి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఒక్క బుగ్గరాజేశ్వరతండాకు తప్ప అన్ని తండాలకు రోడ్లు దారుణంగా ఉన్నాయి. ఈ వర్షాకాలంలో తండాల రోడ్లు ప్రయాణాలకు ఇబ్బందిగా తయారయ్యాయి.
- రాచర్లగుండారం గ్రామానికి వెళ్లే రహదారికి ఇటీవల నిధులు మంజూరుకాగా.. రోడ్డును చదును చేసి ఎర్రమట్టి పోసి వదిలేశారు. ఫలితంగా ఈ వర్షాకాలంలో ఎర్రమట్టి పోసిన రోడ్డు వెంట ప్రయాణించడంతో వాహనాలు జారుతూ.. ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు వాహనాలు ఎర్రమట్టి బురదలో కూరుకుపోతున్నాయి.

తండాలకు నిలిచిన ఆర్టీసీ సేవలు

చందుర్తి(వేములవాడ):

- మారుమూల గిరిజన తండావాసుల రాకపోకలు సాగించేందుకు గతంలో వేసిన రహదారులు అధ్వానంగా మారాయి. కనీస మరమ్మతులు చేయడం లేదు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సుల్లో వెళ్తే ఒళ్లు హూనమయ్యేలా అధ్వానంగా రోడ్లు తయారయ్యాయి.
- చందుర్తి మండలంలోని పలు గిరిజన తండాలకు ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. రోడ్లు గుంతలమయం కావడంతో ఆర్టీసీ అధికారులు బస్సులు నడపడం లేదు. పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- చందుర్తి మండలం జలపతితండా నుంచి వట్టిమల్ల పుట్టలమల్లన్న ఆలయం వరకు గల మూడు కిలోమీటర్ల రోడ్డుపై నాలుగు లోలెవల్ వంతెనలు ఉన్నాయి. చిన్నపాటి వర్షం పడిన లోలెవల్ వంతెనలపై రెండు మీటర్ల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తుంటుంది. దీంతో నెలల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. కనీసం పొలాల వద్దకు కూడా వెళ్లలేని పరిస్థితి. లోలెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

మట్టి రోడ్లు ధ్వంసం

రుద్రంగి(వేములవాడ):

- రుద్రంగి నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుక్కలగండితండా దారి పూర్తిగా ధ్వంసమైంది. రుద్రంగిలోని నాగారం చెరువులోకి వెళ్లే ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం కాలువపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు, ఎల్లంపెల్లి ఎత్తిపోతల నీరు విడుదల చేసినప్పుడు తండాకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి నిర్మించి, బీటీ రోడ్డు వేయాలని గిరిజనులు కోరుతున్నారు.

జర్రున జారుడే..

వీర్నపల్లి(సిరిసిల్ల):

- వీర్నపల్లి మండలంలోని గోన్యానాయక్‌తండా నుంచి మద్దిమల్ల గ్రామానికి వెళ్లే దారి మూడు కిలోమీటర్లు బురదమయంగా మారింది. రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నడవాల్సిందే.
- వీర్నపల్లి మండలంలో 10 తండాలు గ్రామపంచాయతీలుగా మారాయి. మండలంలోని ఐదు గిరిజనతండాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు.
- భూక్యతండా, బావుసింగ్‌నాయక్‌తండా, మద్దిమల్లతండా, కేలోత్‌తండా, కాశితండాలకు రోడ్డు సౌకర్యం లేదు. గిరిజనులకు మట్టిరోడ్లే దిక్కు. అత్యవసరం వేళ అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదు.

అడుగు వేయడం కష్టమే..



రాచర్లగుండారం గ్రామానికి కొత్తగా రోడ్డు వేశారు. మరమ్మతులు దేవుడెరుగు మంచిగా ఉన్న రోడ్డుపై ఎర్రమట్టి పోయడంతో కాలుతీసి కాలువేయడం కష్టంగా మారింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి లేదు. అధికారులకు చెప్పుకుంటే పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో ఎర్రమట్టితో పోసిన రోడ్డు జర్రున జారుతోంది. వెంటనే రోడ్డు మరమ్మత్తు పనులు పూర్తి చేయాలి.

– భూక్య కమల, రాచర్లగుండారం

రోడ్లు బాగు చేయండి



తారు రోడ్డు చెదిరిపోయి గుంతలమయమైంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడైనా ఊరికి పోదామంటే నాలుగైదు కిలోమీటర్ల దూరంలోని సనుగుల గ్రామానికైనా, వట్టిమల్ల పుట్టలమల్లన్న ఆలయం వరకైనా నడిచి వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోంది. రోడ్డు బాగు చేస్తే ఈ తిప్పలు తప్పుతాయి.

– గుగులోతు రాము, జలపతితండా

జలపతితండాపై చిన్నచూపు



చందుర్తి మండలంలోని సనుగుల గ్రామపంచాయతీ పరిధిలోని దేవుని, జలపతితండాలు ఉండేవి. 2018 లో దేవునితండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి, జలపతితండాను విలీనం చేశారు. దేవుని తండాలో ఉన్న అభివృద్ధి జలపతి తండాలో కనిపించడం లేదు. దేవునితండా వరకు తారురోడ్డు వేసి ఆపేశారు. జలపతితండా వరకు మట్టిరోడ్డే ఉంది.

– లకావత్ సంతోష్, జలపతితండా

నడవలేకపోతున్నాం



మట్టి రోడ్డు కావడంతో చిన్నపాటి వర్షానికే బురదమయం అవుతుంది. భారీ గుంతలు ఏర్పడి వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగాయి. వర్షాకాలం మద్దిమల్ల నుంచి తండాకు వెళ్లాలంటే నరకం చూస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి.

– ఇస్కిల్ల శ్రీనివాస్, మద్దిమల్ల

వర్షాకాలంలో ఇబ్బంది



మా రాశిగుట్టతండాకు రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ఏళ్లుగా రోడ్డు వసతి లేక వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి తక్షణమే తండాలకు తారు రోడ్డు వేయించాలి.

– భూక్య అరుణ్‌కుమార్, రాశిగుట్ట తండా

ఆకట్టుకున్న కాఫీ టేబుల్ బుక్

- సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి అభినందనలు



రాజన్న సిరిసిల్ల జిల్లా కాఫీ టేబుల్ బుక్‌ను పరిశీలిస్తున్న అశోక్‌రెడ్డి, పక్కనే డీపీఆర్వో దశరథం.

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణలో రూపొందించిన కాఫీ టేబుల్ బుక్ అకట్టుకుంటుందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గురువారం కాఫీ టేబుల్ బుక్‌ను పరిశీలించారు. 'ఏ స్టోరీ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్' శీర్షికతో జిల్లా అధికారులు సాధించిన ప్రగతి చిత్రాలను ఆసక్తికరంగా ఈ బుక్‌లో పొందుపరిచారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ బుక్‌ను డీపీఆర్వో ఎం.దశరథం కమిషనరేట్‌లో అశోక్‌రెడ్డికి అందించారు. అన్ని జిల్లాల్లోనూ ఇలాంటి కాఫీ టేబుల బుక్‌ను రూపొందించేందుకు కృషి చేయాలని డీపీఆర్వోలకు సూచించారు. జిల్లాపై రూపొందించిన ఈ బుక్ బాగుందని డీపీఆర్వో దశరథంను అభినందించారు.

కొండగట్టు చోరీలో ప్రధాన నిందితుడి రిమాండ్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రకాశ్



దొంగ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

మల్యాల(చొప్పదండి): కొండగట్టు దేవస్థానంలో గత ఫిబ్రవరిలో జరిగిన దొంగతనం కేసులో ప్రధాన నిందితుడు రామారావు జాదవ్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఆర్.ప్రకాశ్ తెలిపారు. మల్యాల పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. దొంగతనానికి పాల్పడ్డ జాదవ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన మల్యాల సీఐ కోటేశ్వర్, మల్యాల ఎస్సై అశోక్, కొడిమ్యాల ఎస్సై వెంకట్రావులను డీఎస్పీ అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో ఏడుగురి అరెస్ట్

సిరిసిల్లక్రైం: న్యాయవాదిపై దాడి చేసి, కులంతో దూషించిన ఏడుగురిని సిరిసిల్ల పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాలతో వారిని గురువారం రిమాండ్ పంపినట్లు తెలిపారు. బాధితుడు మొగిలి రాజు తెలిపిన వివరాలు. మొగిలి రాజు న్యాయవాదిగా పనిచేస్తుండగా, కుటుంబీకులు కులవృత్తిలో భాగంగా పందులు పెంచుతున్నారు. దీనిలో భాగంగా గతేడాది ఆగస్టులో 3న కుటుంబీకులతోపాటు పందులను పట్టేందుకు రాజు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన కొందరు మున్సిపల్ అధికారులు ఆదేశాలతో వచ్చామంటూ మొగిలి రాజుతోపాటు కుటుంబీకులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. సిరిసిల్ల ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు కులం పేరుతో దూషించారంటూ కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసు అధికారులు నిందితులను గురువారం కామారెడ్డిలో అదుపులోకి తీసుకున్నారు. కామారెడ్డి జిల్లా బిక్కునూర్‌కు చెందిన దండి అజిత్‌సింగ్, దండి గోపాల్‌సింగ్, దండి సుర్జీత్‌సింగ్, దండి గంగుసింగ్, కామారెడ్డి జిల్లా బతుకమ్మకుంటకు చెందిన టాంగ్ అరవింద్‌సింగ్, టాంగ్ బందల్‌సింగ్, టాంక్ యాదిసింగ్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఆపన్నహస్తం అందించరూ..

- కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న యువకుడు
- నెలరోజులుగా ఆస్పత్రిలో చికిత్స
- రూ.లక్ష వరకు స్నేహితుల సాయం
- చికిత్సకు రూ.10 లక్షలు ఖర్చవుతాయన్న వైద్యులు
- ఆర్థికసాయం కోసం ఎదురుచూపు



ఆర్థికసాయం అందిస్తున్న యువమిత్ర యూత్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగరాజు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం.. బూర్గుపల్లి గ్రామానికి చెందిన అక్కరాజు గంగరాజు (23) కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. గంగరాజు తండ్రి అక్కరాజు చిన్న నర్సయ్య గతంలోనే మృతిచెందాడు. కూలీ నాలీ చేస్తూ తల్లి పద్మ సాకుతోంది. ఇంటర్ వరకు చదివిన గంగరాజు తల్లికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. గంగరాజుకు కడుపులో ఇబ్బందిగా ఉండటంతో ఆస్పత్రిలో చూపించారు. కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని, ఇందుకు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించారని, గంగరాజు స్నేహితుడు పెరుక మహేశ్ తెలిపాడు. నెలరోజులుగా కరీంనగర్‌లోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నాడు.

వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా రూ.లక్ష సాయం

గంగరాజు లివర్ వ్యాధితో బాధపడుతున్నాడని, ఆర్థికసాయం అందించాలని గ్రామానికి చెందిన పెరుక మహేశ్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేశాడు. దీంతో పలువురు బోయినపల్లి, బూర్గుపల్లి తదితర గ్రామాల దాతలు స్పందించి ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా రూ.లక్ష వరకు సాయం అందించని మహేశ్ తెలిపాడు.

రూ.1.33 లక్షలు అందజేసిన దాతలు

గంగరాజు వైద్యంకోసం ఇప్పటివరకు రూ. 1,33,000 దాతలు విరాళంగా అందజేశారు. ఇందులో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తనయుడు సుంకె దీక్షిత్ రూ.10వేలు, బోయినపల్లి యువమిత్ర యూత్ సభ్యులు మంగళవారం రూ.5వేలు నగదు అందించారు. బోయినపల్లి సంబ కిశోర్ రూ.3 వేలు అందించాడు.

ఫోన్‌పే, గూగుల్ పే నంబర్లు
94947 23408

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- కలెక్టరేట్ ముందు మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్లటౌన్: నెలల తరబడిగా పెండింగ్‌లో ఉంటున్న బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ వంట కార్మికులకు ప్రతీ నెల 5వ తేదీలోపు బిల్లులు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కోడిగుడ్లు, గ్యాస్, ఇతర నిత్యావసరాల చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే నిత్యావసరాల వస్తువులు సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈమేరకు కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం అందించారు. యూనియన్ జిల్లా కన్వీనర్ మీస లక్ష్మణ్, కడారి రాములు, మంత్రి చంద్రయ్య, అనసూయ, పుష్పలత, లక్ష్మి, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి



సిరిసిల్ల: కోనరావుపేట మండలం బావుసాయిపేట శివారులో ఓ కుక్క ఇలా నీళ్లు తాగేందుకు డబ్బాలో తలపెట్టడంతో ఇరుక్కుపోయింది. డబ్బా నుంచి తలను బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో డబ్బాలోంచి గుడ్డి గుడ్డిగా చూస్తూ.. ఇబ్బంది పడుతూ.. కుక్క నానా కష్టాలు పడుతోంది. తన ముందు కాళ్లతో డబ్బా నుంచి తలను బయటకు తీయలేక వదిలేసింది.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు సంఘీభావాన్ని తెలుపుతున్న జేఏసీ నాయకులు

- జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వెంకటయ్య

చందుర్తి(వేములవాడ): గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చాగంటి వెంకటయ్య డిమాండ్ చేశారు. చందుర్తి మండల పరిషత్ ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు గురువారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదన్నారు. ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనాన్ని రూ.19వేలకు పెంచాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, పోతురాజు రాజేశం, మామిడి నరేశ్, వాసం కిరణ్‌కుమార్, గంగాజల, చరణ్, లక్కొబాబు పాల్గొన్నారు.